# మత మార్పిడి చెందిన షెడ్యూల్డ్ కులాల క్రిస్టియన్లకు ఇతర షెడ్యూల్డ్ కులాల వారితో సమాన హోదా కల్పనకు అవసరమైన రాజ్యాంగ సవరణకై భారత ప్రభుత్వాన్ని కోరుతూ

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ తీర్మానం

### తేదీ:06.02.2019

మన సమాజంలో అంతర్భాగమైన కుల వ్యవస్థ మనుషుల మధ్య అడ్డుగోడలు సృష్టించింది. తరతరాల వారసత్వంగా వస్తున్న కుల వ్యవస్థ అసమానతలను పెంచి పోషించింది. హిందూ మత విశ్వాసాలను అనుసరిస్తున్న ప్రజలను కులవ్యవస్థ సామాజిక వర్గాలుగా విడదీసింది. ఎంతో వివక్షకు కారణమయ్యింది. పుట్టుక ఆధారంగా వారి సంతతికి సామాజిక గౌరవం, హోదా, హక్కులు లభిస్తున్నాయి. ఉన్నత వర్గాలవారే హక్కులు, సామాజిక గౌరవాన్ని అనుభవిస్తూ అట్టడుగు వర్గాల వారు హక్కులకు దూరమై ఆఖరికి జీవనోపాధికి ఎంచుకున్న వృత్తుల్లోనూ అపరిశుభ్రంగా భావించే వృత్తులను బలవంతంగా ఎంచుకోవాల్సింది. అస్పృశ్యత కులవ్యవస్థలో అంతర్భాగమైంది.

తత్ఫలితంగా వారు దోపిడీకి, అణచివేతకు గురవుతున్నారు. పేదరికంలో మగ్గుతున్నారు. సామాజికాభివృద్ధిలో అర్ధవంతమైన భాగస్వామ్యం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే అభివృద్ధికి దూరంగా మానవ హక్కులను నిరాకరించినట్లయ్యింది.

కులవ్యవస్థ నుంచి ఎదురవుతున్న అవమానాలు,అణచివేతను, ఆధిపత్యాన్ని తప్పించుకుని స్వేచ్ఛగా, సగౌరవంగా జీవించాలన్న ఆంకాంక్షతో అట్టడుగు వర్గాలవారు మత విశ్వాసాలు మార్చుకుంటున్నారు. హిందూ సమాజంలో ఇమడలేక దళితులు క్రైస్తవ, బౌద్ధ, సిక్కు మతాలకు మారిపోయారు. కానీ కులవ్యవస్థ జాఢ్యం అక్కడ కూడా వెన్నాడుతోంది. అయా మతాల్లో వారు వేరుగా ఒక సమూహంగా వుండాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడా సమానత్వం లేదు. సమభావం లేదు. ఫలితంగా వారి మతమార్పిడి ఉద్దేశం నెరవేరలేదు.

స్వాతంత్ర్యానంతరం దేశంలో కులవ్యవస్థ ఏర్పర్చిన అసమానతలను తొలగించడానికి భారతరత్న డా. బి ఆర్ అంబేద్కర్ వారి కృషి, మేధస్సుతో రచింపబడిన భారత రాజ్యాంగం ద్వారా పొందిన విధివిధానాల ద్వారా ఉపాధి, విద్యలో షెడ్యూల్డ్ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. అస్పృశ్యత నిర్మూలనకు, దురాగతాల నిర్మూలనకు చట్టాలు చేయబడి, సామాజిక ఆర్థికాభివృద్ధికి ఉపప్రణాళికలను అమలు చేయడం జరిగింది.

ఆర్టికల్ 341 ద్వారా సంక్రమించిన అధికారంతో రాష్ట్రపతి రాజ్యాంగ ఉత్తర్వు 1950 మరియు 1976 రాజ్యాంగ సవరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ లో 59 కులాలను షెడ్యూల్డు కులాల జాబితాలో చేర్చారు. ఆ ఉత్తర్వు

ప్రకారం 'Not withstanding anything contained in paragraph 2, no person who profess a religion different form Hindu, shall be deemed to be a member of Scheduled Castes' అని పేర్కొన్నారు. ఈ పేరాను 1956లో సవరించి సిక్కులను, 1990లో మరో పర్యాయం సవరించి బౌద్ధులను షెడ్యూల్డ్ కులాల పరిధిలోకి తెచ్చారు. అలా షెడ్యూల్డు తరగతుల వారు బౌద్ధ మతంలో చేరినా, సిక్కు మతంలో చేరినా వారికి యధావిధిగా రాజ్యాంగబద్ధమైన షెడ్యూలు తరగతుల రిజర్వేషన్లు, అస్పృశ్యత, దురాగతాలకు వ్యతిరేకంగా అందజేసే రక్షణ, సామాజిక ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేశారు. క్రైస్తవ మతంలో చేరిన షెడ్యూల్డ్ కులాల వారికి వీటిని నిరాకరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977లో జీవోనెం 341 dt.30.8.1977 తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ ద్వారా అమలయ్యే Non Statutory రాయితీలైన ఆర్థిక భద్రతా పథకాలు దళిత క్రిస్టియన్లకు వర్తింపజేశారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ జీవో 191 తేదీ 29.07.1986 ద్వారా షెడ్యూల్డ్ హాస్టళ్లలో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారికి 12% ప్రవేశాలను కల్పించింది.40% బీసీలకు కేటాయించిన గృహాలలో 10% గృహాలను మైనారిటీలకు (క్రిస్టియన్లు కలిపి) సాంఘిక సంక్షేమ శాఖ జీవో 90 తేదీ 24.9.2001 ద్వారా 10% శాతం గృహాలను మైనారిటీలకు కేటాయించింది. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లను కూడా వర్తింపజేస్తూ జీవో తెచ్చింది.

సామాజిక దురాచారాలైన అస్పృశ్యత, అంటరానితనాన్ని, మరియు అణచివేతను అధిగమించడానికి తమ పూర్వీకులు క్రైస్తవ మతానికి మారినా, ఆశించిన ఫలితాలు రాలేదని ప్రభుత్వానికి కొందరు వ్యక్తులు, సంస్థల నుంచి అభ్యర్థనలు, విజ్ఞప్తులు అందుతున్నాయి. క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డ్ కులాల వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు మరియు సామాజిక రుగ్మతలు అలాగే ఉండిపోయాయి. వెలివేసినట్లుగా గ్రామానికి దూరంగా నివసిస్తూ అవే ఆచార వ్యవహారాలను పాటిస్తూ ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. చట్టబద్ధమైన రాయితీల విషయంలో దళిత క్రిస్టియన్లకు మరియు సిక్కుమతం, బౌద్ధమతంలోకి మారిన షెడ్యూల్డు కులాల వారి మధ్య వివక్ష ఉంది.

సమ్మిళిత విధానంతో సమాజంలోని అన్ని వర్గాల వారు అభివృద్ధి ఫలాలను అనుభవించాలన్న ఉద్దేశంతో నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డు కులాల వారి విజ్ఞప్తులు సబబుగా భావించి మరియు వారు క్రైస్తవ మతం స్వీకరించిన తరువాత కూడా అస్పృశ్యత లాంటి దురాచారాలకు గురవుతున్నారని భావించి వారు సిక్కుమతం మరియు బౌద్ధమతంలోకి మారిన వారితో సమానంగా చూడాలని నిశ్చయించింది.

కావున క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డ్ కులాల వారికి కూడా షెడ్యూల్డ్ కులాల హోదాను కల్పించడానికి అనువుగా రాజ్యాంగ సవరణ తేవాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఇందువల్ల ఏ మతానికి చెందిన వారయినా సమాన హక్కులు, రక్షణ, మరియు రాయితీలు షెడ్యూల్డ్ కులాల వారితో సమానంగా పొందే అవకాశం ఏర్పడుతుంది.

నారా చంద్రబాబు నాయుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి